ప్రజాశక్తి
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు



మంగళగిరిలో లక్ష్మణరావు కుమారుడిపై దాడి...



జిల్లా పేరు	కేంద్రాలు	ఓటర్లు	పోలైనవి	శాతం
ఏలూరు	21	16099	11801	73.30
కృష్ణా	77	63114	44125	69.91
ఎన్‌టిఆర్	112	78063	51279	65.69
గుంటూరు	149	108109	71836	66.45
బాపట్ల	34	24493	18198	74.30
పల్నాడు	90	57238	44263	77.33
మొత్తం	483	347116	241502	69.57

గుంటూరు జిల్లాలో 66, పల్నాడు జిల్లాలో 77 శాతం పోలింగ్

దొంగ ఓట్లతో

అక్రమాలు.. అరాచకాలు..

- ఎమ్మెల్యేల కనుసన్నల్లో పోలింగ్
- పోలింగ్ కేంద్రాల అక్రమణతో రిగ్గింగ్
- అధికార యంత్రాంగం నిస్సహాయత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన పోలింగ్‌లో టిడిపి నాయకుల అక్రమాలు, దౌర్జన్యాలు యథేచ్ఛగా కొనసాగాయి. టిడిపితో పాటు కొన్నిచోట్ల జనసేనపార్టీ కూడా ఈ దౌర్జన్యాల్లో పాలుపంచుకుంది. పోలింగ్ గురువారం ఉదయం మందకొడిగా ప్రారంభమైనా మధ్యాహ్నం తరువాత వేగం పుంజుకుంది. పల్నాడు జిల్లాలోని 28 మండలాలకు గాను 20 మండలాల్లో టిడిపి నాయకులు అక్రమాలకు తెరతీశారు. పిడిఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ అయిన లక్ష్మణరావు తరుపున ఏజెంట్లుగా ఉన్న వారిపై టిడిపి నాయకులు దౌర్జన్యం చేశారు. పలువురు ఏజెంట్లను బయటకు నెట్టేసి దొంగ ఓట్లు వేయించుకున్నారు. మాచర్ల, గురజాల, వినుకొండ, చిలకలూరిపేట, పెదకూరపాడు, తెనాలి, మంగళగిరి తదితర నియోజకవర్గాల్లో దౌర్జన్యాలు కొనసాగాయి. పోలింగ్ శాతం కూడా పెరిగింది.

టిడిపి తరుపున జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులు పోలింగ్ కేంద్రాల్లో యథేచ్ఛగా సంచరించడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. చదువుకోని, ఓటులేని కూలీలను తీసుకొచ్చి ఓట్లు వేయించారు. ఉదయం 10 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం 11.59 శాతం పోలింగ్ నమోదవగా 12 గంటలకు 29.97 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 49.06 శాతం, సాయంత్రం 4 గంటలకు, ఆ తరువాత మొత్తంగా 69.57 శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ప్రకటించారు. సాధారణంగా ఇటువంటి ఎన్నికల్లో 60 శాతం ▶ 2లో



మంగళగిరిలో దాడులపై పోలీసులతో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు



గుంటూరులోని హిందూ కాలేజీ పోలింగ్ కేంద్రం లోపల ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కూటమి శ్రేణుల హడావుడి



గుంటూరులోని పాలిటెక్నిక్ కాలేజీలో పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న ఓటర్లు



పల్నాడు జిల్లా దాచేపల్లి పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న ఓటర్లు



గుంటూరు జిల్లా తెనాలిలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న ఓటర్లు



స్ట్రాంగ్‌రూమ్‌కు వచ్చిన బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి, గుంటూరు జెసి, ఇతర అధికారులు

స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసిన అనంతరం ఆయా బ్యాలెట్ బాక్సులను గురువారం సాయంత్రం బ్యాలెట్ బాక్సులను ఏసీ కాలేజిలోని రిసెప్షన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఈ ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, నగర కమిషనర్ పి.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలితో కలిసి రిటర్నింగ్ అధికారి అయిన గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు.



సత్తెనపల్లిలో పుతుంబాక భవన్ నుండి తాలూకా సెంటర్‌కు ర్యాలీగా వెళ్తున్న ప్రజా సంఘాలు

అక్రమాలను ఖండిస్తూ నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు సంబంధించిన పోలింగ్ ఏజెట్లపై కూటమి నాయకుల దౌర్జన్యం, దాడులకు నిరసనగా గురువారం సాయంత్రం స్థానిక పుతుంబాక భవన్ నుండి తాలూకా సెంటర్ వరకు ప్రజాసంఘాలు నిరసన ర్యాలీ చేపట్టారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన దాడులు దౌర్జన్యాలకు ప్రజలు విగి వేసారారని, మరోవైపు ప్రజాస్వామ్యాన్ని కాపాడంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు, కూటమి నాయకులు ఇప్పుడు చేస్తున్నదేమిటని నిలదీశారు. దాడులను మానుకోకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. పల్నాడు జిల్లాలో 36 పోలింగ్ కేంద్రాల్లో కెఎస్ లక్ష్మణరావు తరుపున పోలింగ్ ▶ 2లో

అక్రమాలకు తెగబడుతున్న అధికార పార్టీ : కెఎస్ లక్ష్మణరావు -8లో

ఓటమికి భయపడి.. దొంగోట్లకు తెగబడి.. -2లో



పల్నాడు జిల్లాలో 77.33 శాతం పోలింగ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో మొత్తం 57238 పట్టభద్రుల ఓటర్లున్నారు. వీరిలో 37973 పురుషులు, 19261 మంది మహిళలు, నలుగురు ఇతరులు. వీరికోసం జిల్లాలో 90 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 44263 మంది (77.33) ఓటేశారని, అధికారులు ప్రకటించారు. బ్యాలెట్ బాక్సులను పటిష్ట బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాల నుండి గుంటూరు తరలించారు. 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది.

కూటమి నేతల హల్‌చల్

- దొంగ ఓట్లు వేసిన అధికార పార్టీ!
- పోలింగ్ బూత్‌లలో తిష్ట
- పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లకు బెదిరింపులు

ప్రజాశక్తి-కంచికచర్ల

ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మద్దతుగా అధికార పార్టీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారు. కంచికచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూత్‌లకు పిఒలుగా స్థానిక అధికారులనే ఉన్నతాధికారులు నియమించటంతో పిఒలు ఇతర సిబ్బంది, కూటమి అభ్యర్థికి అనుకూలంగా పని చేసినట్లు పలువురు ఓటర్లు తెలిపారు. పోలింగ్ సమయం గంట ఉందనగా అప్పటి వరకు పోలింగ్ కేంద్రంకు దగ్గరలో తిష్ట వేసుకుని కూర్చున్న అధికార పార్టీ నాయకుడు 50 మంది అనుచరులతో కలిసి పోలింగ్ బూతుల్లోకి చొరబడి దొంగ ఓట్లు వేసినట్లు స్వతంత్ర అభ్యర్థి ఏజెంట్లు తెలిపారు. దొంగ ఓట్లు వేయడాన్ని ప్రశ్నించిన పీడీయఫ్ అభ్యర్థి ఏజెంట్లను బెదిరించారు. బూత్‌లలో కూటమి నాయకులు, కార్యకర్తలు పదుల సంఖ్యలో చొరబడినా పోలింగ్ సిబ్బంది కాని, పోలీసులు కాని, తహశీల్దార్ కాని వారిని కట్టడి చేయకపోగా వారికి సహకరించినట్లు పలువురు ఓటర్లు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న అక్రమాలపై పీడియఫ్ అభ్యర్థి మద్దతు దారులు ఉన్నతాధికారూలకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఉన్నతాధికారులు స్థానిక తహశీల్దార్, ఇతర అధికారు లను వివరణ అడిగితే పోలింగ్ సక్రమంగానే జరుగుతుందని చెప్పారని స్వతంత్ర అభ్యర్థి మద్దతుదారులు తెలిపారు.

ప్రజాస్వామ్యనికి విరుద్ధంగ అధికార పార్టీ చర్యలు

ప్రజాశక్తి - పెదకాకాని

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ లో టిడిపి అక్రమాలు అడుగడుగునా దౌర్జన్యాలకు పాల్పడరని కొంతమంది అధికారులు అతి ఉత్సాహం ప్రదర్శించారని సిఐటియు జిల్లా అధ్యక్షులు నన్నపనేని శివాజి ధ్వజమైతారు. పోలింగ్ ప్రారంభం నుండి బూతు ఏజెంట్ల నిర్వహణలో అధికార పార్టీ అక్రమాలకు పాల్పడింది అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ పోలింగ్ బూతుల్లో డమ్మీ అభ్యర్థుల తరఫున ఏజెంట్లను ప్రతి బూతులో ఇద్దరిని కూర్చోబెట్టడం తక్కెళ్ళపాడు,ఉప్పలపాడు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెదకాకాని పోలింగ్ జరిగే ప్రాంతంలో దొంగ ఓట్లు వేయటానికి మొత్తం పోలింగ్ బూతులు ఆక్రమించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. అక్కడ ఉన్న ప్రజా సంఘాల నాయకులు, పిడిఎఫ్ ఎమ్ ఎల్ సి అభ్యర్థి లక్ష్మణ్ తరపున ఉన్న పోలింగ్ బూత్ ఏజెంట్లు దొంగ ఓట్లు వేసే వారిని నివారించే ప్రయత్నం చేయగా వాదోప వాదనలు జరిగే క్రమంలో పోలీస్ వారి జోక్యంతో అందరిని బయటకి పంపించడం జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంత దౌర్జన్యానికి పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఓటమికి భయపడి.. దొంగోట్లకు తెగబడి..

- టిడిపి అభ్యర్థి తరుపున భారీగా రిగ్గింగ్
- వినుకొండ రూరల్, ఈపూరు, శావల్యాపురం మండలాల్లో 90 శాతానికి పైగా పోలింగ్!

ప్రజాశక్తి - గుంటూరు రూరల్

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో అధికార కూటమి సర్వాధికారాన్ని ఉపయోగించి నిబంధనలకు తూట్లు పొడిచింది. సిట్టింగ్ ఎమ్మెల్సీ అయిన పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు, కూటమి మద్దతుతో టిడిపి తరుపున అభ్యర్థిగా దిగిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ మధ్య ప్రధాన పోటీ నేపథ్యంలో ఓటమి తప్పదేమోననే భయంతో కూటమి బరితెగించింది. వినుకొండ నియోజకవర్గంలో 5 మండలాల్లో 15 పోలింగ్ కేంద్రాలు ఉండగా మధ్యాహ్నం వరకూ పోలింగ్ కాస్తంత సజావుగానే నడిచి 13.11 శాతం నమోదైంది. 12 గంటల వరకు 39.60 శాతానికి చేరింది. పిడిఎఫ్‌కు అనుకూలంగా సరళి ఉందని భావించిన కూటమి కుట్రలకు తెరతీసింది. 1 గంట నుండి 3 గంటల వరకు, 3 నుండి 4 గంటల వరకు పోలింగ్ 40 శాతం నుండి 70 శాతానికి పెరిగింది. గంట వ్యవధిలో 85 శాతం పైబడి ఓట్లు నమోదవడం గమనార్హం. పట్టభద్రులు కాని వారు, కనీసం 10 కూడా ఉత్తీర్ణులవ్వని ఓటర్లయిపోయారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 10 మందికిపైగా టిడిపి అభ్యర్థికి చెందిన ఏజెంట్లు ఉండడం పిడిఎఫ్ నుండి ఒక్కరే ఉండడంతో బెదిరింపులు, దొంగ ఓట్లకు అడ్డే లేకుండా పోయింది. పోలింగ్ కేంద్రాల వద్ద మూకలుగా చేరి దౌర్జన్యాలకు పాల్పడ్డారు. సిసి టివి పుటేజీలను పరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూస్తాయని పిడిఎఫ్ ఏజెంట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వినుకొండ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు 7816 మంది కాగా 6096 ఓట్లు నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. వినుకొండ పట్టణ పరిధిలో 3009 మందికిగాను 2043 మంది, వినుకొండ రూరల్ పరిధిలో 454 మందికిగాను 414, బొల్లాపల్లి మండలంలో 1161 మందికిగాను 943, నూజెండ్ల మండలంలో 1030 మందికిగాను 870, శావల్యాపురం మండలంలో 659 మందికిగాను 613, ఈపూరు మండలంలో 984 మందికిగాను 847 మంది ఓటేశారని అధికారులు తెలిపారు.

అక్రమాలు.. అరాచకాలు..

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ జరిగే అవకాశాలు ఉంటాయని, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం లోపు పోలింగ్ జరిగేదని, ఈసారి గ్రామీణ ప్రాంత నియోజకవర్గాల్లో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు దాటినా కూడా పోలింగ్ జరిగింది. బాపట్లలో 4 గంటల తరువాత పిడిఎఫ్ ఏజెంట్లను బయటకు పంపి టిడిపి వారే ఓట్లు వేసుకున్నారని ఫిర్యాదులు వచ్చాయి. ఏజంట్లును బెదిరించి అధికారులు కూటమి నాయకులతో కుమ్మక్కై దొంగ ఓట్లు వేసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటరు వద్ద గుర్తింపు కార్డులు చూడకుండానే ఓటు వేసేందు అనుమతించడం, దీన్ని పిడిఎఫ్ ఏజెంట్లు ప్రశ్నిస్తే నోరు నొక్కేందుకు యత్నించడం, ఇరు పక్షాలకు వాదనలు పలుచోట్ల జరిగాయి. ఎలాగైన గెలవాలని కూటమి నాయకులు ఓటర్లను అనేక రకాలుగా ప్రలోభాలకు గురి చేశారు. ఇతర జిల్లాల్లో, రాష్ట్రాల్లోని నియోజకవర్గ పట్టభద్రుల ఓటర్లకు ప్రయాణ ఖర్చులతో పాటు కొంత డబ్బు ఇచ్చి ఓట్లు పోలయ్యేందుకు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. తెనాలి, గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో కూడా ఇదే తంతు కొనసాగింది. పెదకూరపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు తూర్పులో నశీర్ అహ్మద్ పోలింగ్ కేంద్రాల్లో హల్‌చల్ చేసినా అధికారులు నియంత్రించలేదు. పల్నాడు ప్రాంతంలో పిడిఎఫ్ ఏజెంట్లను టిడిపి వారు బయటకు పంపించి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసుకున్నారు. కెఎస్ లక్ష్మణరావుకు చెందిన ఏజెంట్లను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. మొత్తంగా అసలు ఓటర్ల కంటే ఇతర ఓటర్లతోనే టిడిపి నాయకులు పోలింగ్ చేయించడం ద్వారా గెలుపుపై టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ధీమాగా ఉన్నారు.

ప్రజాశక్తి బెల్లంకొండ



బెల్లంకొండ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహించు సమయంలో లక్ష్మణరావు ఏజెంట్ పుల్లారావు మరియు లగడపాటి వేణుగోపాల్ ఏజెంట్ అయిన నరసింహారెడ్డి మీద కూటమినేతలు నాయకులు దౌర్జన్యకాండ ప్రదర్శించారు. ఇరువురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు రవిబాబు, గద్దె చలమయ్య, విజయ్ కుమార్ బెల్లంకొండ మండల పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పుల్లారావు, నరసింహారెడ్డిలను మధ్యాహ్న సమయంలో పంపించారు.

అక్రమాలను ఖండిస్తూ నిరసన ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

ఏజెంట్లుగా ఉన్న వారిపై కూటమి నాయకులు దాడులు, దౌర్జన్యాలు చేశారని, వారిని బయటకు నెట్టివేసి రిగ్గింగు చేసుకున్నారని విమర్శించారు. రాని ఓటర్ల తరుపున దొంగ ఓట్లు వేసుకున్నారని అన్నారు. సాధారణ ఎన్నికల్లోనూ లేని విధంగా ఒక్కో పోలింగ్ బూత్‌లో 80 నుండి 91 శాతం వరకు పోలింగ్ నమోదు ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. పోలింగ్ 80 శాతానికి మించిన కేంద్రాల్లో రీపోలింగ్ జరిపించాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు గద్దె చలమయ్య, పి.మహేష్, కె.శివదుర్గారావు, డి.విమల, జి.ఉమశ్రీ, ఎం.జ్యోతి, ఎ.వీరబ్రహ్మం, డి.పుల్లారావు, పి.ప్రభాకర్, పి.సూర్యప్రకాశరావు, రాజకుమార్, వెంకటనారాయణ పాల్గొన్నారు.



గుంటూరు హిందూ కాలేజీలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కెఎస్ లక్ష్మణరావు





ముప్పాళ్లలో ఓటేసేందుకు వీల్‌చైర్‌లో... సత్తెనపల్లిలో రెండు చేతులపై

ఎన్‌టిఆర్ జిల్లాలో 65.69 శాతం పోలింగ్

ప్రజాశక్తి-విజయవాడ

గురువారం జరిగిన కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఎన్‌టిఆర్ జిల్లాలో 65.69 శాతం నమోదైంది. జిల్లాలో మొత్తం ఓటర్లు 78,063 మందికి 51,279 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవాడ సిటీతో పాటు జిల్లా వ్యాప్తంగా 112 పోలింగ్ స్టేషన్ల ద్వారా పోలింగ్ జరిగింది. ఎన్నికల సంఘం నిర్దేశించిన సాయంత్రం 4 గంటలకు పోలింగ్ గడువు ముగిసినా కానీ సాయంత్రం 5.30-6 గంటల వరకు కూడా పలు పోలింగ్ స్టేషన్లలో అడపాదడపగా ఓటర్లు క్యూలైన్లలో ఉండటం కనిపించింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని సివిఆర్ మునిసిపల్ స్కూల్ పోలింగ్ బూత్ నెంబర్ 89ఎ పోలింగ్ బూత్‌లో సాయంత్రం 5.30 గంటల వరకు కూడా ఓటర్లు క్యూలైన్‌లో ఉన్నారు. నిర్దేశించి గడువు 4 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌ల్లోకి వారిని అనుమతించలేదు. అటువంటి వారు గేటు బయటే కొద్ది సేపు ఉండి వెనుదిరగాల్సి వచ్చింది. పటమట జడ్‌పిహైస్కూల్, సత్యనారాయణపురం ఎకెటిపిఎం స్కూల్, వన్‌టౌన్ గాంధీజి మునిసిపల్ హైస్కూల్ తదితర పోలింగ్ స్టేషన్లలో క్యూలైన్‌లో ఉండి పోలింగ్ సమయం ముగిసినా కానీ ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వికలాంగులకు వీల్ చైర్స్‌ను అందుబాటులో ఉంచారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం (సిసిసి) నుంచి సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేశారు. పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో 450 మంది పోలీసు సిబ్బందితో భద్రతా చర్యలు తీసుకున్నారు. కొన్ని పోలింగ్ సెంటర్లలో పోలీసు అధికారులు వీండియానం అనువంతించలేదం. ఎన్‌జిఒ హోమ్ ఏరియాలో ఉన్న చిట్టూరి స్కూల్‌లో ఒక లేడీ ఎస్‌ఐ మీడియాను స్కూల్ ప్రాంగణంలోకే అనుమతించలేదు. ఆ తరువాత పిఆర్‌ఒ ఆఫీసు తరుపున అక్కడకు విచ్చేసి డిసిపికి ఫోన్ చేయించిన తరువాత ఆ ఎస్‌ఐ లోపలకు అనుమతించడం గమనార్హం.



గుంటూరులో చంటిపిల్లాడితో..

గ్రామ రథోత్సవానికి గట్టుపల్లి సుబ్రహ్మణ్యం వితరణ



రథం లాగుతున్న భక్తులు



రథం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి చేబ్రోలు

మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజు చేబ్రోలు గ్రామంలో జరిగే నాగేంద్ర స్వామి రథోత్సవంను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా స్థిరాస్తి వ్యాపారస్తుడు, బిల్డర్ గట్టుపల్లి సుబ్రహ్మణ్యం రూ. 50వేలు విలువైన అల్పాహారాన్ని గ్రామోత్సవంలో పాల్గొన్న ప్రజలు భక్తుల కోసం అందజేసినట్లు చేబ్రోలు గ్రూపు దేవస్థానముల కార్యనిర్వహణాధికారి ఇమ్మిడిశెట్టి వినయ్ కృష్ణ తెలిపారు. 1000 మందికి సరిపడా, లడ్డులు, పులిహోర, చక్ర పొంగలి భక్తులకు అందించారు. ప్రతి ఏటా మహాశివరాత్రి మరుసటి రోజు నాగేంద్ర స్వామి రథోత్సవాన్ని చేబ్రోలు గ్రామంలో ఘనంగా నిర్వహించటం ఆనవాయితీ. గ్రామంలో జరిగే ఈ గ్రామోత్సవ వేడుకలు గురువారం గ్రామస్తులు, ఆలయ నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో నాగేంద్ర స్వామి భారీ రథాన్ని మెలిపెట్టిన 100 అడుగుల పొడవు ఉండే రెండు పెద్ద తాళ్లతో లాగుతారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

భాషా సాహిత్య అనువాదంతో జాతీయ సమైక్యత

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఉర్దూ విభాగంలో రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. కాల్పనికేతర సాహిత్య ధోరణులు 21వ శతాబ్దం: ఉర్దూ, ఇంగ్లీష్, ఇతర దక్షిణ భారత భాషలు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్, సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. సురేష్ కుమార్ అధ్యక్షత వహిం చారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ ఉర్దూ భాషకు విశిష్టత ఉందని, ఉర్దూ భాషను అభ్యసించినట్లయితే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. సదస్సు డైరెక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ వివిధ భాషల సాహిత్యాల మధ్య అనువాదాలు జరగాలని దాని ద్వారా జాతీయ సమైక్యతకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కీలక ఉపన్యాసకులుగా పాల్గొన్న మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ నసీముద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ భాష పూర్తిగా భారతీయ భాష అని దాని మూలాలు సంస్కృత భాషలో ఉన్నాయన్నారు. మరొక విశిష్ట అతిథిగా పాల్గొన్న జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఢిల్లీ నుంచి వచ్చిన ఆచార్య రిజ్వానూర్ రెహమాన్ మాట్లాడుతూ భాషల మధ్య సమన్వయం ఉండాలని ఎన్ని భాషలు నేర్చుకుంటే అన్ని ఎక్కువ ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. సదస్స సంచాలకులు ఎస్.కె షాబాద్ మాట్లాడుతూ సదస్సుకు 70 మంది పరిశోధన పత్రాలు సమర్పించారని కేరళ, తమిళ నాడు, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి పరిశోధకులు వచ్చినట్లు పేర్కొన్నారు.

పల్నాడు జిల్లాలో 77.33 శాతం నమోదు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో 57238 పట్టభద్రుల ఓట్లు ఉండగా 37973 పురుష ఓటర్లు, 19261 మంది మహిళా ఓటర్లు, 4 తర్డ్ జెండర్ ఓట్లు ఉన్నాయి.

ఎన్నికల నియమావళి నిర్దేశించిన సమయానికి 44263 ఓట్లు పోల్ కావడంతో 77.33 శాతం నమోదయినట్లు జిల్లా ఎన్నికల అధికారి మురళి ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 90 పోలింగ్ కేంద్రాల నుండి బ్యాలెట్ బాక్సులను పటిష్ట బందోబస్తు మధ్య గుంటూరు తరలిస్తున్నారు. వచ్చే నెల 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది.

చేబ్రోలులో 68.09శాతం పోలింగ్ నమోదు



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న గుంటూరు డిఎస్‌పి

ప్రజాశక్తి చేబ్రోలు

చేబ్రోలులో ప్రశాంతంగా ముగిసిన గుంటూరు - కృష్ణ జిల్లాల నియోజకవర్గం పట్టభద్రుల శాసనమండలి సభ్యుల ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ. సూర్యదేవర నరసయ్య హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ స్టేషన్ల లో 68.09 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ కె శ్రీనివాస శర్మ తెలిపారు. మండలంలో మొత్తం 1887 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 847 మంది, స్త్రీలు 438 పోలింగ్ లో పాల్గొని ఓట్లు వేశారని, మొత్తం అని 1285 ఓట్లు వేశారని తెలిపారు. పోలింగ్ స్టేషన్ 265లో మొత్తం ఓట్లు 876 కు పురుషులు 383, స్త్రీలు 202 మొత్తం 584 మంది, పోలింగ్ స్టేషన్ 266లో మొత్తం 1011 ఓటర్లకుగాను పురు షులు 464 , స్త్రీలు 236 మొత్తం 700 మంది వారి ఓటు హక్కుకు వినియోగించుకున్నారు. గుంటూరు డిఎస్‌పి డి.ఏడుకొండల రెడ్డి, తహసీల్దార్ కె శ్రీనివాస శర్మ, ఎస్ఐ, డి వెంకటకృష్ణ పోలింగ్ సరళిని పరిశీలించారు.

దుర్గి పోలింగ్ కేంద్రంలో 791 ఓట్లు పోలింగ్

ప్రజాశక్తి-దుర్గి

మండల కేంద్రమైన దుర్గిలో ఉపాధ్యాయ పట్టభద్రుల పోలింగ్ కేంద్రంలో మొత్తం 986 ఓట్లగాను 791 ఓట్లు పోలైనట్లు పిఓ వెంకటేశ్వర్లు తెలిపారు ఉదయం 8 గంటల నుంచి హెూలీకి కేంద్రంలో ఓట్లు వేసేందుకు క్యూ లైన్‌లో బారులు తీరారు తహశీల్దార్ ఫణీంద్ర కుమార్ పోలింగ్ కేంద్రం వద్ద ఆశాంతం పర్యవేక్షించారు దుర్గి ఎస్సై సుధీర్‌కుమార్ ఎటువంటి అవాంఛ నీయ సంఘటన జరగకుండా సిబ్బందితో పర్యవేక్షించారు ఎస్పీ కంటి శ్రీనివాస్‌రావు మూడు గంటల సమయంలో పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు మొత్తం ఈ పోలింగ్ కేంద్రంలో 79 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు నాలుగు గంటల తరువాత కూడా పోలింగ్ కేంద్రంలో 130 మందికి వరకు ఓటర్లు క్యూ లైన్ లో నిలబడ్డారు.

కోటప్పకొండ తిరునాళ్లలో అంబులెన్స్ సేవలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు సూచనల మేరకు మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో గురువారం తెల్లవారుజాము వరకు ప్రథమ చికిత్స, అంబులెన్స్ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి తెలిపారు. కొండపైకి మెట్ల మార్గంలో వచ్చిన భక్తులకు, గాయాలైన భక్తులకు (120 మందికి) నొప్పులతో, జ్వరంతో, నీరసంతో, బాధపడే (700 మందికి) వారికి ప్రథమ చికిత్స చేసి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్స్



రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం

విష్ణు, అక్షయ్, అఖిల్, శ్రీహరి, ఆనంద్, ప్రణవ్, ఆశిక్ ,అజిష్ ,అద్వైత్, నరసరావుపేట ఫార్మసీ కాలేజ్ యూత్ క్రాస్ వాలంటీర్స్ ముక్రం అలీ, సలీం, కిరణ్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి వర్గీయులను అరెస్టు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా నరసరావుపేట మండలంలోని గోనెపూడి గ్రామ వైసిపి వర్గీయులు నిర్మించిన ప్రభ ఉన్న వాహనాన్ని డిజె సామగ్రిని ధ్వంసం చేసిన టిడిపి వర్గీలను తక్షణమే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఐక్యమత్యంగా సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించుకోవాల్సిన సందర్భంలో ఇటువంటి దాడులకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయకపోతే వివాదాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహించినట్లేనని అన్నారు. తిరునాళ్లకు వచ్చిన ఏకైక వైసిపి ప్రభ గోనెపూడి గ్రామానిదేనని ఇది కూడా ఓర్వలేని టిడిపి వర్గీయులు దాడికి పాల్పడడం తగదన్నారు. ధ్వంసం అయిన వాటి విలువ రూ 7 లక్షల వరకు ఉంటుందన్నారు. వైసిపి హయాంలో ఏనాడు ఇటువంటి ఘటనలకు పాల్పడలేదని గుర్తు చేశారు. దాడి ఘటనకు సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. విషయాన్ని తమ అధినేత దష్టికి తీసుకువెళతామన్నారు. ఇటువంటి దాడులను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్)
తెనాలి కోర్టు
I.A. 781/2024 O.S. 428/2023
I.A. 943/2023

బిట్వీన్ :
దొడ్డక సాంబశివరావు .... పిటీషనర్
మరియు
దానబోయిన లక్ష్మీనారాయణ (డైడ్) అండ్ అదర్స్
ఆర్5 : దానబోయిన పావని, తండ్రి : లక్ష్మీనారాయణ, నివాసం : డోర్ నెం. 2-39-7, గాంధీనగర్, తెనాలి
.... రెస్పాండెంట్స్

పై నెంబరు ఐ.ఏ.లో కోర్టువారు పంపిన నోటీసులను మీరు/ 5వ రెస్పాండెంట్ తీసుకొనక బుద్ధిపూర్వకంగా తిప్పి పంపుచున్నందున, కోర్టువారు మీకు /5వ రెస్పాండెంట్‌కు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీరు /5వ రెస్పాండెంట్ ది. 04-03-2025న ఉదయం 10-30 గం.లకు పై కోర్టునందు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై సంజాయిషీ తెలుపవలెను. లేనియెడల ఐ.ఏ.ని మీకు /5వ రెస్పాండెంట్ పరోక్షంగా తీర్మానించబడును.
వాయిదాతేది : 04-03-2025

ఎస్.బి.శివ,
పిటీషనర్ తరపు న్యాయవాది.

ప్రకటన
మహారాజశ్రీ తెనాలి అదనపు సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ. 148/2021 ఐ.ఏ. 149/2021
ఇన్ ఓ.యస్.నెం. 36/2021

బిట్వీన్ :
మద్దిల హిమబిందు మాధవీలత మరియు ఇతరులు .... వాదులు
అండ్
సూరిశెట్టి రామకృష్ణారావు (డైడ్) మరియు ఇతరులు .... ప్రతివాదులు

టు,
కోనూరి భాగ్యలక్ష్మి, **డి2/ఆర్2**
భర్త : (లేటు) సూరిశెట్టి రామకృష్ణారావు, డోర్ నెం. 11-15-8/3, రామిరెడ్డిపేట, నరసరావుపేట, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావా ఓ.యస్. 36/21లోను మరియు ఐ.ఏ. 148/2021, ఐ.ఏ. 149/2021లలోను మీకు శ్రీ కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు పంపించవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 13-3-2025 వ తేదీకి వాయిదా వేసి వున్నారు. సదరు వాయిదా ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల శ్రీ కోర్టువారిచే మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియపరచడ మైనది.
(శ్రీ కోర్టువారికి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 13-3-2025

ఇట్లు
మాదినేని రామ్‌ప్రసాద్,
పిటీషనరు/వాదుల తరపు న్యాయవాది.

CHANGE OF NAME
I, PUNGAMSETTY BHASKARA RAO, S/o. PUNGAMSETTY SUDHAKAR NAIDU, R/o D.No.12-1099/2, Mahanadu Road-9, Tadepalli, Guntur District, Andhra Pradesh, INDIA have changed my name PUNGAMSETTY BHASKARA RAO (old name) to PUNGAMSETTY BHASKAR NAIDU (New name) Same as intimated general Public

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్)
తెనాలి కోర్టు
I.A. 780/2024 O.S. 428/2023

బిట్వీన్ :
దొడ్డక సాంబశివరావు .... పిటీషనర్
మరియు
దానబోయిన లక్ష్మీనారాయణ (డైడ్) అండ్ అదర్స్
ఆర్5 : దానబోయిన పావని, తండ్రి : లక్ష్మీనారాయణ, నివాసం : డోర్ నెం. 2-39-7, గాంధీనగర్, తెనాలి
.... రెస్పాండెంట్స్

పై నెంబరు ఐ.ఏ.లో కోర్టువారు పంపిన నోటీసులను మీరు/ 5వ రెస్పాండెంట్ తీసుకొనక బుద్ధిపూర్వకంగా తిప్పి పంపుచున్నందున, కోర్టువారు మీకు /5వ రెస్పాండెంట్‌కు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు ఆర్డరు వేసినారు. కావున మీరు /5వ రెస్పాండెంట్ ది. 04-03-2025న ఉదయం 10-30 గం.లకు పై కోర్టునందు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై సంజాయిషీ తెలుపవలెను. లేనియెడల ఐ.ఏ.ని మీకు /5వ రెస్పాండెంట్ పరోక్షంగా తీర్మానించబడును.
వాయిదాతేది : 04-03-2025

ఎస్.బి.శివ,
పిటీషనర్ తరపు న్యాయవాది.



గాయపడిన రాంబాబునాయక్, ఖాజావలీ

భవనంపై నుండి జారి గాయపడిన కార్మికులు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని 19వ వార్డు లోనిర్మాణంలో ఉన్న భవనంపై నుండి జారిపడిన భవన నిర్మాణ కార్మికులు. తీవ్రంగా గాయపడిన కార్మికులు. రెండవ అంతస్తులు సింటెక్స్ వాటర్ ట్యాంకును కింద నుండి పైకి ఎక్కించే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో నిర్మాణ కార్మికులు బాణావత్ రాంబాబునాయక్, ఖాజావలీ తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన కూలీలను సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాంబాబు నాయక్ వెన్నుపూసకు తీవ్ర గాయమైంది. ఖాజావలి కాళ్లకు తీవ్ర గాయాలు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు.

భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

తీవ్రంగా గాయపడిన భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవా లని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు డిమాండ్ చేశారు. గాయపడిన నిర్మాణ కార్మికులను అవ్వారు ప్రసాద్ రావు ఆసుపత్రిలో పరామర్శించారు. రెక్కాడితే గాని డొక్కా డని కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం మండల కార్యదర్శి షేక్ సైదులు పాల్గొన్నారు.

రీజినల్ కోఆర్డినేటర్‌గా శ్రీరెడ్డి

ప్రజాశక్తి చేబ్రోలు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ మహిళ విభాగ రీజినల్ కోఆర్డినేటర్‌గా తనకు సొసైటీ బాధ్యతలు అప్పగించి నియామక పత్రాన్ని అందించారని గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెంకి చెందిన శ్రీ వెంకట శేషకుమారి రెడ్డి శ్రీరెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని ఆర్ సి డి ఎస్ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేందర్‌రెడ్డి, (మహిళా అధ్యక్షురాలు) జనరల్ సెక్రెటరీ కాలవ శ్రీలత రెడ్డి అందజేశా రన్నారు. రెడ్డిజాతి శ్రేయస్సు, ఐక్యత కోసం సొసైటీ మహిళా విభాగ రీజినల్ కోఆర్డి నేటర్‌గా కొనసాగనున్నట్లు తెలిపారు. సొసైటీ నియమ నిబంధనను అనుసరించి క్రమశిక్షణతో అన్ని రెడ్డి సంఘాలను, సమన్వయంతో, రెడ్ల సమస్యల పట్ల అవగాహనతో సమస్యల పరిష్కార దిశగా నిస్వార్థముగా, బాధ్యతలు నిర్వర్తిస్తానని శ్రీరెడ్డి చెప్పారు.



దొంగ ఓట్ల నమోదుపై ప్రశ్నిస్తున్న పిడిఎఫ్ మద్దతుదార్లు

గుర్తింపు కార్డు లేకున్నా అనుమతి

ప్రజాశక్తి - రాజుపాలెం

మండలంలో 1269 ఓట్లకుగాను 897 (70 శాతం) పోలింగ్ నమోదైంది. పోలింగ్‌కు చివరి గంటలో కూటమి నాయకులు దొంగ ఓట్లు వేయించుకుంటున్నారనే సమాచారంతో ప్రజా సంఘాల నాయకులు గద్దె చలమయ్య, ఎస్.దుర్గాబాయి పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత తలెత్తింది. స్లిప్‌లు ధ్రువపత్రాలను పరిశీలించకుండానే ఓటేసేలా అధికారులు సహరించారని నాయకులు మండిపడ్డారు.

50 ఓట్ల నుండి 35 శాతానికి

ప్రజాశక్తి - అచ్చంపేట

మండలంలో 1484 ఓట్ల గాను 1225 (84.43 శాతం) మంది ఓటేశారని తహశీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మధ్యాహ్నానికి 50 ఓట్లు పోలవగా నాలుగు గంటల వరకు 35 శాతం పోలవడం గమనార్హం. ఆధారాలేమీ లేకుండా వచ్చినా వారినీ ఓటేయించారని రైతు సంఘం నాయకులు ఆవుల ఆంజనేయులు, ఆర్.వెంకటేశ్వర్లు విమర్శించారు. దీనిపై ఎన్నికల అధికారులను ప్రశ్నించారు.



ప్రజాశక్తి - నకరికల్లు


స్థానిక జెడ్‌పి పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1644 ఓట్లకు గాను 1135 ఓట్లు పోలయ్యాయి. 352వ పోలింగ్ కేంద్రంలో 584 ఓట్లు, 353వ పోలింగ్ కేంద్రంలో 551 ఓట్లు నమోదయ్యాయి. 69 శాతం నమోదైనట్లు తహశీల్దార్ పుల్లారావు తెలిపారు. పోలింగ్ చివరి గంటలో దొంగ ఓట్లు వేయడానికి కూటమి నాయకుల యత్నానికి పోలీస్, రెవెన్యూ అధికారులు సహకరించారు.

ప్రజాశక్తి -దాచేపల్లి

స్థానిక జెడ్‌పి పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో కూటమి నాయకులు దొంగ ఓట్లు వేయించారు. దాచేపల్లి పట్టణ పరిధిలో 876 ఓట్లకు గాను 776 ఓట్లు, రూరల్ గ్రామాల పరిధిలో 761 ఓట్లకు గాను 662 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. టిటిడి పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి ఇక్కడే తన ఓటు హక్కును వినియోగించయుకున్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటేస్తున్న ఎమ్మెల్యేలు లక్ష్మీనారాయణ, అరవిందబాబు



నరసరావుపేటలోని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

- పిడిఎఫ్ ఏజెంట్లను బెదిరించి, బయటకు గెంటి దర్జాగా రిగ్గింగ్
- చదువులేని కూలీలను తీసుకొచ్చి దండిగా దొంగ ఓట్ల నమోదు
- దారుణంలో పాలుపంచుకున్న ఎమ్మెల్యే, పోలీసులతో వాగ్వాదం
- పోలీసులు, అధికారుల ప్రేక్షకపాత్ర

పల్నాట టిడిపి దొంగాట

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరిగింది. సిటింగ్ ఎమ్మెల్సీ అయిన పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు చెందిన పోలింగ్ ఏజెంట్లపై అధికార టిడిపి నేతలు పల్నాడు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. ఉదయం నుండే ఈ ధోరణి ఉన్నా మధ్యాహ్నం 2 గంటల తర్వాత మరీ బరితెగించారు. ఎక్కడికక్కడ దొంగ ఓట్లు వేయించుకున్నారు. నరసరావుపేట పట్టణంలో పట్టభద్రులు కాని, ఓటు హక్కు లేని సిమెంట్, వడ్రంగి, ఇతర పనులు చేసుకునే వారిని తీసుకొచ్చి ఓట్లేయించేందుకు యత్నించగా కొన్నిచోట్ల పిడిఎఫ్ ఏజెంట్లు అడ్డుకున్నారు. నరసరావుపేట పట్టణం భరంపేట 375వ పోలింగ్ కేంద్రంలో పిడిఎఫ్ ఏజెంట్లను బయటకెళ్లండంటూ టిడిపి నేతలు బెదిరించారు. కొమ్ముల నాగేశ్వరరావుపై దాడి చేయగా మరొకర్ని ఇష్టారీతిన దుర్భాషలాడారు.

ఓటేయనీయకుండా.. రిగ్గింగుకు..

సాయంత్రం 4 గంటలకల్లా క్యూలో ఉన్నవారికి ఓటేసే అవకాశం కల్పించాల్సి ఉన్నా పిడిఎఫ్ అభ్యర్థి మద్దతుదారులైన వారిని టిడిపి నేతల ఆదేశాలతో పోలీసులు, పోలీసు సిబ్బంది వెనక్కు పంపించారు. సమయం ముగిసిన తర్వాత మున్సిపల్ బాలుర హైస్కూలులో పోలింగ్ కేంద్రానికి తాళాలేస్తున్న క్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఎపిటిఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ తమ అనుచరులతో వచ్చి రిగ్గింగ్‌కు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తలెత్తిన ఉద్రిక్తతతో దొంగ ఓట్లు వేసేందుకు వచ్చిన వారు భయంతో పరుగులు తీశారు. నరసరావుపేట, రొంపిచర్లలో 16 పోలింగ్ కేంద్రాల్లోను అరవిందబాబు, మోహనకృష్ణ సందర్శించారు.

రిగ్గింగ్‌పై ఫిర్యాదు చేసినా..

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పోలింగ్‌లో కూటమి నేతలు దర్జాగా రిగ్గింగ్ చేసుకున్నారు. అధికారులు సైతం చూసి చూడనట్లు వ్యవహరిహించడంతో దొంగ ఓట్లు దండిగా గుద్దుకున్నారు. ఉదయం మందకోడిగా ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ మధ్యాహ్నానికి ఓటర్లతో కేంద్రాలు నిండిపోయాయి. దొంగ ఓట్లు వేసేందుకు కూటమి నాయకులు కొందర్ని రంగలోకి దించి ఒక్కొక్కరితో 3 నుండి 5 ఓట్లకు పైగా వేయించారు. కొందర్ని పిడుగురాళ్ల పట్టణంలో 329 మరియు 331 పోలింగ్ కేంద్రాల్లో పిడిఎఫ్ ఏజెంట్లు అడ్డుకోవడంతో కొందరు వెనక్కు జారుకున్నారు. అధికారులకు తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పిడిఎఫ్ ఏజెంట్లు తెలిపారు. కనీస చదువు కూడా లేనివారు ఓటింగ్‌లో పాల్గొన్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే కూటమి నాయకులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని చెప్పారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు సైతం చోద్యం చూస్తు ఉండిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

గురజాల నియోజకవర్గంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 10 గంటలకు 12 శాతం పూర్తికాగా ఎన్నిక సమయం ముగిసే సమయానికి 89 శాతానికి చేరింది. పిడుగురాళ్ల పట్టణంలో 329వ పోలింగ్ కేంద్రంలో 505 ఓట్లకు గాను 440 (88 శాతం) ఓట్లు నమోదయ్యాయి. 329ఎ పోలింగ్ కేంద్రంలో 516 ఓట్లకు 442 (86.6 శాతం), 330 పోలింగ్ కేంద్రంలో 892 ఓట్లకు 811 (91 శాతం), 331వ కేంద్రంలో 978 ఓట్లకు 840 (86 శాతం), గురజాల పట్టణంలోని 324 వ కేంద్రంలో 830 ఓట్లకు 748 (90 శాతం), 325వ కేంద్రంలో 667 ఓట్లకు 625 (93 శాతం), దాచేపల్లి పట్టణంలోని 326వ పోలింగ్ కేంద్రంలో 876 ఓట్లకు 786 (88 శాతం), 327వ కేంద్రంలో 761 ఓట్లుకు గాను 662 (86.9), మాచవరం మండలంలోని 332 పోలింగ్ కేంద్రం 809 ఓట్లకు గాను 711 (87.8 శాతం) చొప్పున పోలయ్యాయి. గురజాల నియోజకవర్గంలోలో మొత్తంగా 6,813 ఓట్లకు గాను 6065 ఓట్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నా ఓటు ఎవరో వేశారు : ముదేల పెద లక్ష్మారెడ్డి



ఓటేయడానికి సుమారు 3 గంటలకు పైగా క్యూలైన్లో నిలబడగా తీర తన ఓటు అప్పటికే వేసినట్లు ఉందని మండలంలోని పెద ఆగ్రహారం గ్రామానికి చెందిన ముదేల పెదలక్ష్మారెడ్డి వాపోయారు. దీనిపై ఆయన ఎన్నికల అధికారిని ప్రశ్నించగా కూటమి నాయకులు ఆయన్ను పక్కకు తీసుకెళ్లారు.. కావాలంటే వేరే వారి ఓటు నువ్వు వేసుకో అన్నారని, ఇలా చాలామంది ఓట్లు వేశారని పెదలక్ష్మారెడ్డి చెప్పారు.

పిడిఎఫ్ ఏజెంట్లను బయటకు నెట్టేసి..

ప్రజాశక్తి - మాచర్ల

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మాచర్ల పట్టణం, వెల్దుర్తి, విజయపురిసౌత్ పోలింగ్ కేంద్రాల్లో హడావుడి మధ్య ముగిసింది. మధ్యాహ్నం 2 గంటలకే తమను బయటకు బలవంతంగా పంపించి పెద్దఎద్దున కూటమి నాయకులు దొంగ ఓట్లు వేసుకున్నారని పిడిఎఫ్ ఏజెంట్లు చెప్పారు. ఉదయం మందకొడిగా ఉన్న ఓటింగ్ 10 గంటల నుండి ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్‌కు తరలివచ్చారు. పోలింగ్ బూత్‌ల పరిసరాల్లో కూటమి నాయకులు అధిక సంఖ్యలో ఉండి ఓటర్లను ప్రభావితం చేశారు. మాచర్ల, వెల్దుర్తి, విజయపురిసౌత్ పోలింగ్ కేంద్రాల్లో పిడిఎఫ్ ఏజెంట్లు మధ్యలోనే పోలింగ్ స్టేషన్స్ వదిలి బయటకు వచ్చారు. పెద్ద సంఖ్యలో దొంగ ఓట్లు పోలైనట్లు పిడిఎఫ్ ఏజెంట్ చెప్పారు.



మాచర్లలో 5 పోలింగ్ కేంద్రాలను సెయింట్ ఆన్స్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా ఎస్‌పి కంచి శ్రీనివాసరావు పరిశీలించి మీడియాతో మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రశాంతమైన వాతవారణంలో ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. ఆర్‌డిఒ మురళీకృష్ణ, తహశీల్దార్ కిరణ్‌కుమార్, కమిషనర్ వేణుబాబులు పర్యవేక్షించారు. డిఎస్‌పి జగదీష్, అర్బన్ సిఐ ప్రభాకర్, పలువురు ఎస్‌ఐలు సంధ్యారాణి, నరసింహం బందోబస్తు నిర్వహించారు.


నియోజకవర్గంలో 7,232 ఓట్లుండగా 6,089 (84.20 శాతం) మంది ఓటేశారు. మాచర్ల టౌన్‌లో 5 బూత్‌లు, విజయపురిసౌత్‌లో 1 బూత్, వెల్దుర్తిలో 1, దుర్గిలో 1, కారంపూడిలో 1, రెంటచింతలలో ఒక బూత్, ఏర్పాటు చేశారు. మాచర్ల పట్టణంలోని 5 బూత్‌ల్లో 316లో 678 ఓట్లు, 317లో 586 ఓట్లు, 318లో 735 ఓట్లు, 319లో 650 ఓట్లు, 319 ఎలో 406 ఓట్లు ఉన్నాయి. మాచర్ల టౌన్, రూరల్ యందు 84.9 శాతం పోలింగ్ నమోదైంది. మాచర్ల టౌన్ యందు ఏర్పాటు చేసిన 5 బూత్‌లు, విజయపురిసౌత్‌లోని 1 బూత్ కలిపి 3,399 ఓట్లుకు గాను 2,819 ఓట్లు, వెల్దుర్తి పోలింగ్ స్టేషన్‌లో 973 ఓట్లుకు గాను 808 ఓట్లు, దుర్గి పోలింగ్ స్టేషన్‌లో 974 ఓట్లుకు గాను 786 మంది ఓటేయడంతో 80.7 శాతం నమోదైంది. కారంపూడిలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లో 1,054 ఓట్లుకు గాను 940 మంది, రెంటచింతల పోలింగ్ బూత్‌లో 832 ఓట్లుకు గాను 736 మంది తమ ఓటేయగా 88.47 శాతం నమోదైంది. 97 ఏళ్ల రిటైర్డు టీచరు జానయ్య తన మనమరాలు సహాయంతో సెయింట్ ఆన్స్ బాలికల పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.




మహిళ ఓటు వేయడానికి పురుషుడు

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక జెడ్‌పి పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఓట్లు 1305 ఉండగా 1097 (84) నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగినా అనంతరం అధికార పార్టీ నాయకులు గుంపులు గుంపులుగా పోలింగ్ ప్రాంగణంలోకి ప్రవేశించారు. సెల్ ఫోన్లను పోలింగ్ కేంద్రాల్లోనికి తోలుత అనుమతించలేదు. తర్వాత ఫోన్లో గుర్తింపు కార్డు పేరుతో అనుమతించారు. ఇతరుల ఓట్లను అధికార పార్టీ నాయకులు వేసుకున్నారు. ఒక మహిళ ఓటును పురుషుడు వేయటానికి యత్నించగా పిడిఎఫ్ ఏజెంటు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు శ్రీనివాసరెడ్డి, మహేష్‌రెడ్డి.



జంగా కృష్ణమూర్తి.. డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ దంపతులు

భయపెట్టి.. బెదిరించి.. ప్రలోభపెట్టి!

- 'అధికార' దర్పం.. 'కూటమి' కావరం
- పోలింగ్ కేంద్రాల వద్ద అధికార పార్టీ హవా
- అడుగడుగునా ఉల్లంఘనలు
- దాడులు, దౌర్జన్యాలు
- నిలువరించలేని పోలీసులు, అధికారులు
- అధికారుల అలసత్వాన్ని ప్రశ్నించిన పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు


ప్రజాశక్తి-తెనాలి

కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అధికార పార్టీ నాయకులు అధికార కావరాన్ని చూపారు. పోలింగ్ ఆరంభమైంది మొదలు.. చివరి వరకు ప్రతి బూత్ వద్ద హల్‌చల్ చేశారు. సాధారణ ఎన్నికలను గుర్తు చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూనే ఉన్నారు. తమ పక్షం కాని వారిని కట్టడి చేసేందుకు అన్ని దారులూ వెతికారు. వారిని నిలువరించాల్సిన అధికారులు, పోలీసు యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండిపోయింది. వాస్తవానికి పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు ఉంటాయి. దానిని అమలు చేయాల్సిన బాధ్యత పోలీసులది, అధికారులదే. స్థానిక చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు.. దాని పక్కనే టీడీపీ వర్గీయులు ఓటర్లను ప్రలోభ పెడుతూ శిబిరాలు నిర్వహిస్తున్నా పట్టించుకోలేదు. పైగా బారికేడు దాటి లోపలికి వెళ్లాలంటే ఓటర్ స్లిప్పు ఉన్నవారిని మాత్రమే అనుమతించాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా ఓటరు కాకపోయినా, ప్రతి ఒక్కరినీ పోలింగ్ కేంద్రాల వద్దకు అనుమతించారు. దీంతో అధికార పార్టీ నాయకులు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తమ హవా చాటుకున్నారు. ఈ విషయాన్ని బందోబస్తులో ఉన్న పోలీసుల దృష్టికి కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, సిఐటియు, సిపిఎం నాయకులు తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. ఆయా పోలింగ్ కేంద్రాలలో మెజారిటీ శాతం గుర్తింపు కార్డును కూడా పరిశీలించకుండా ఓటర్లను అధికారులు లోపలికి అనుమతించారంటూ వారు ఆరోపించారు.



అభ్యంతరం వ్యక్తం చేసిన కేఎస్..

ఈలోగా అక్కడికి చేరుకున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు పరిస్థితిని గమనించి 293, 294 పోలింగ్ కేంద్రాలలో పరిస్థితిపై ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. వెబ్ కాస్టింగ్ ఒక పైపు నడుస్తూ ఉందని, గుర్తింపు కార్డు లేకుండా ఓటర్లను ఎలా లోపలికి అనుమతిస్తారు, వారికి ఓటేసే అవకాశం ఎలా కల్పిస్తారు అంటూ పోలింగ్ సిబ్బందిని ప్రశ్నించారు. పరిస్థితి ఇలానే కొనసాగితే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. 295 పోలింగ్ కేంద్రం వద్ద అధికార పార్టీకి చెందిన 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ ఓటర్ల క్యూ లైన్‌కు సమీపంలో బైఠాయించారు. ఆ విషయాన్ని పోలీసులు గమనించి కూడా మౌనంగా ఉన్నారు. అదే విషయంపై లక్ష్మణరావు ప్రశ్నించడంతో ఆమెను బయటకు పంపించేందుకు రెండో పట్టణ ఎస్ఐ ప్రకాశరావు, ఎన్నికల విధుల్లో ఉన్న ఎంఈఓ ఎం.లక్ష్మీనారాయణ నానా తంటాలు పడ్డారు. ఆమె అధికారుల హెచ్చరికలను కూడా లెక్క చేయలేదు. పోలింగ్ జరుగుతున్న సమయంలో అధికార పార్టీ కౌన్సిలర్లు దేశు యుగంధర్, పసుపులేటి త్రిమూర్తి పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. వారిని కట్టడి చేయడంలో అధికారులు విఫలమయ్యారు.



పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన అధికారులు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఓటింగ్ ప్రక్రియను అధికారులు పరిశీలించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ బి.జనార్ధనరావు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో నిషేధాజ్ఞల అమలుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

లక్ష్మణరావు కుమారుడిపై దాడి

మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని సీకే జూనియర్ కళాశాల, బాలురు హైస్కూల్ వద్ద పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఎన్నికల నియమావళికి కూటమి పార్టీ నాయకులు తూట్లు పొడిచారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున ప్రజాసంఘాల నాయకులు అడ్డుకోవడంతో పలు సందర్భాల్లో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు మంగళగిరిలోని పోలింగ్ కేంద్రం వద్దకు రాగానే కొంతమంది దుండగులు రెచ్చిపోయారు. ఆయన కుమారుడితోపాటు, కారు డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇక్కడ పరిస్థితి గందరగోళంగానే ఉంది. జిల్లా అదనపు ఎస్పీ రవికుమార్, ఆర్ఓ సంజనా సిన్హా నేరుగా రంగంలోకి దిగి పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రయత్నం చేశారు. మరోవైపు మంగళగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే కూటమి నాయకులు అధికార బలాన్ని చూపించారు. ఉదయం కొందరు ఓటర్లు తమ స్లిప్పులు కోసం వెతుకుతుండగా.. స్లిప్పులు ఇస్తూ తమకే ఓటు వేయాలంటూ అడగడం కనిపించింది. దీంతో పిడిఎఫ్ అభ్యర్థికి చెందిన ప్రజా సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అమల్లో ఉన్న 144 సెక్షన్‌ను అతిక్రమించి టిడిపి నేతలు అలపాటి రాజా మద్దతుదారులు నేరుగా కేంద్ర సమీపానికి చేరుకోవడంపై ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నించగా.. ఘర్షణకు దిగారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సార్వత్రిక ఎన్నికలను తలపించే విధంగా అధికార బలం స్పష్టంగా చూపిస్తూ అధికారులను, పోలింగ్ బూత్ ఏజెంట్లను ఇబ్బందికి గురి చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ సెంటర్‌కు 100 మీటర్ల దూరంలో నలుగురితో కలిసి గుంపుగా ఉండకూడదు. అధిక సంఖ్యలో జాతరను తలపించేలా అధికార పార్టీ నేతలు, ఆలపాటి అనుచరులు ఒక రకమైన భయాందోళనలకు గురి చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు పోలింగ్ కేంద్రాల వద్దకు రావడంతో ఎక్కడికక్కడ కూటమి నాయకులు ఘర్షణకు దిగేందుకే ప్రయత్నించారు. దీంతో పోలీసులు చేరుకుని ఇరు వర్గాలను అక్కడ నుంచి బయటకు పంపారు. కూటమి నేతలు ఏ మాత్రం తగ్గకుండా అధికారం తమదేనని చేతులు చూపిస్తూ పోలీసులను సైతం భయభ్రాంతులకు గురి చేశారు.





మేడికొండూరులో 70.18 శాతం పోలింగ్ నమోదు

మేడికొండూరు : మేడికొండూరులో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 203, 204 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు. మొత్తం ఓట్లు 1,741 ఉండగా.. 1,222 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 70.18 పోలింగు శాతం నమోదైంది. గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ మేడికొండూరు పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

తెనాలిలో 68.91 శాతం నమోదు

తెనాలి : తెనాలి నియోజకవర్గంలో 68.91 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. తెనాలిలో 26 పోలింగ్ కేంద్రాలు, కొల్లిపర మండలంలో మూడు పోలింగ్ కేంద్రాలలో కలిపి 28,358 మంది ఓటర్లు ఉండగా.. వారిలో పురుషులు 9,406, మహిళలు 6690, మొత్తం 16,096 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు.

స్వల్ప ఘటనలు మినహా..

తాడేపల్లి : తాడేపల్లి పట్టణానికి సంబంధించి పోలకంపాడు ఎలిమెంటరీ పాఠశాలలో నాలుగు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 3,006 మంది ఓటర్లు ఉండగా.. 2,345 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి లోకేష్ పేషీకి చెందిన వ్యక్తిని అంటూ ఓ యువకుడు పోలింగ్ బూత్ దగ్గర కాసేపు హల్‌చల్ చేశాడు. పిడిఎఫ్ అభ్యర్థి తరఫున కార్యకర్తలకు, తెలుగుదేశం కార్యకర్తలకు ఇక్కడ స్వల్ప వివాదం చోటుచేసుకుంది. తాడేపల్లి రూరల్ గ్రామాలైన కుంచనపల్లి, కొలనుకొండ, ప్రటూరు, గుండిమెడ, ఇప్పటం, మెల్లిటంపూడి, చిరావూరు, వడ్డేశ్వ రం గ్రామాలకు సంబంధించి తాడేపల్లి క్రిస్టియన్ పేటలో 285, 285 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. రాజధాని గ్రామాలైన ఉండవల్లి, పెనుమాక కు సంబంధించి పంచాయతీ కార్యాలయం వద్ద గల పాఠశాలలో 284, 284 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

ఉండవల్లిలో నకిలీ ఓట్లు

పట్టభద్రుల ఎన్నికల్లోనూ నకిలీ ఓట్లకు తెలుగుదేశం పార్టీ తెరతీసింది. ఉండవల్లిలోని హైస్కూల్లో జరుగుతున్న ఓటింగ్ సందర్భంగా ఉదయం నుంచి పిడిఎఫ్ అభ్యర్థి తరపున ఎన్నికల ఏజెంట్‌గా కూర్చొన్న వ్యక్తులను ప్రలోభ పెట్టాడానికి కొందరు ప్రయత్నించారు. చూసీచూడనట్లు పొమ్మని చెప్పుకొచ్చారు. పిడిఎఫ్ అభ్యర్థి తరపున కూర్చున్న ఏజెంట్లు అందుకు అంగీకరించలేదు. దీంతో టిడిపి కార్యకర్తలు అక్కడే తిష్ట వేసుకుని కూర్చొన్నారు. పోలింగ్ ఇంకో గంటలో ముగుస్తుంది అనగా సిఐ బత్తుల కళ్యాణ్ రాజు సమక్షంలో తెలుగుదేశం కార్యకర్తలు దొంగ ఓట్లు వేసుకున్నట్లు ఆరోపణలు వినిపించాయి. పిడిఎఫ్ ఏజెంట్లను బయటకు తీసుకొచ్చి గొడవెందుకని సర్దిచెప్పి, మరో 50 దొంగ ఓట్లు దాకా ఇష్టం వచ్చినట్టు గుద్దుకున్నారని తెలుస్తోంది. పిడిఎఫ్ ఏజెంట్, ప్రజా సంఘాల కార్యకర్తలు నిరసన తెలిపినా సీఐ పట్టించుకోకపోవడం గమనార్హం.

వైద్యసేవలు

తాడేపల్లి, తాడేపల్లి క్రిస్టియన్ పేట, ఉండవల్లి లలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల వద్ద తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వైద్య సేవలు అందించారు.













ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ అడుగడుగుడనా ఉల్లంఘనలకు పాల్పడింది. అధికార దర్పానికి పాల్పడింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వారి తీరును పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తీవ్రంగా వ్యతిరేకించారు. మరోవైపు ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఎన్నికల ప్రక్రియను అధికారులు పర్యవేక్షించారు. ఆ దృశ్యాలు..



విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బొల్లాపల్లి మండలం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది తప్పనిసరిగా కార్యాలయానికి సకాలంలో హాజరు కావాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎవరు అలసత్వం ప్రదర్శించినా సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తప్పనిసరిగా అర్హులకు అందజేయాలని సూచించారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దని, సంక్షేమ పథకాలకు సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు విడుదల చేయాలన్నారు. విద్యార్థులకు, రైతులకు, గ్రామ ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.



బోధవ్యాధిపై అప్రమత్తం

ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల పట్టణంలో బోదవ్యాధి రోగులకు కిట్లను గురువారం వైద్యాధికారులు అరుణ్, లక్ష్మీప్రసన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగునీటిలో పెరిగే క్యూలెక్స్ దోమల ద్వారా బోధ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని వివరించారు. మురికివాడలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలన్నారు. కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి డి.లక్ష్మయ్య, టి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-కారంపూడి

కారంపూడి పట్టణంలోని టిడిపి కార్యకర్త అరబోలు వరాలుకు చెందిన నివాస గృహం బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు కాలిపోవడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెను పరామర్శించారు. మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు తక్షణసాయంగా పదివేల రూపాయలు అందించారు. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, రాబోయే రోజుల్లో నివాస గృహాన్ని ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చప్పిడి రాము, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, కాటంరెడ్డి నాగలక్ష్మి, షేక్ నన్నేసా, కృష్ణ, కాసుల శంకర్ బగురిశెట్టి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.







ఓటు వేసేందుకు క్యూలో నిల్చొన్న పట్టభద్రులు

ఓటెత్తిన పట్టభద్రులు..

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్


కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సత్తెనపల్లి నియోజకవర్గంలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు సాగింది సత్తెనపల్లి నియోజకవర్గంలో పట్టభద్రులు 9,764 ఓటర్లకు గానూ 6,679 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 14 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య నరసరావుపేటకు తరలించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

దుర్గి పోలింగ్ కేంద్రంలో 791 ఓట్లు పోలింగ్

దుర్గి : మండల కేంద్రమైన దుర్గిలో మొత్తం 986 ఓట్లకు గాను 791 ఓట్లు పోలైనట్లు పీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. తహసీల్దారు ఫణీంద్ర కుమార్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. దుర్గి ఎస్సై సుధీర్ కుమార్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశారు. ఎస్పీ కంటి శ్రీనివాస్‌రావు మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, సిబ్బందికి సూచనలు చేశారు. సాయంత్రం 4 గంటల తర్వాత కూడా పోలింగ్ కేంద్రంలో 130 మంది వరకు ఓటర్లు క్యూలో నిల్చొన్నారు.



పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుల తరలింపు

కారంపూడి : కారంపూడి పట్టణంలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్లో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 1,054 ఓట్లలో 940 ఓట్లు పోలైనట్లు మండల తహసీల్దారు వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పట్టభద్రులు తమ ఓటును వినియోగించుకున్నారని ఆయన చెప్పారు. ఎస్సై వాసు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

యడ్లపాడులో 81.7 శాతం పోలింగ్

యడ్లపాడు : పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగు మండలంలో ప్రశాంతంగా ముగిసింది. యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాల 380, 381 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,085 ఓట్లు ఉండగా 887 పోలయ్యాయి.

సత్తెనపల్లి : సత్తెనపల్లి పట్టణంలో ఆరు పోలింగ్ కేంద్రాలుండగా.. వీటిల్లో 4,127 మంది ఓటేయాల్సి ఉంది. నిర్ణీత సమయానికి 2,806 (67.99 శాతం) మంది ఓటేశారని అధికారులు ప్రకటించారు. రూరల్ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాల్లో 1,252 మంది ఓటేయాల్సి ఉండగా 861 (68.76 శాతం) మంది ఓటేశారు.

విజయపురిసౌత్ : మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో 320 నంబరు పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 343 ఓట్లు ఉండగా 273 ఓట్లు పోలయ్యాయి. 80 శాతం ఓటింగు నమోదైంది. విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెల్దుర్తి : మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 973 ఓట్లకు గానూ 808 ఓట్లు పోలైనట్లు ప్రిసైడింగ్ అధికారి లక్ష్మారెడ్డి తెలిపారు. అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్‌గా వెంగయ్య వ్యవహరించారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు.

ముప్పాళ్ల: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 348, 349 నంబర్ల రెండు పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం ఉపాధ్యాయ, ఉద్యోగ, గ్రాడ్యుయేట్ ఓట్లు 1,466 ఉండగా 984 ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ శాతం 67.12 గా నమోదైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఎస్ఐ వి.సోమేశ్వర రావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 92 ఏళ్ల రిటైర్ వెటర్నరీ డాక్టర్ కోంజేటి వెంకటేశ్వరరావు ఓటు వేయడం గమనార్హం.

చిలకలూరిపేట : పట్టణంలో ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. వైసీపీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కమిషనర్ శ్రీహరిబాబు, ఏ.వి. రమణ, విజయశ్రీ, ఎం.పి.డి.ఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్, హేమాలతా దేవి, స్వరూపారాణి, సిఐలు రమేష్, సుబ్బారాయుడు, ఎస్సైలు పర్యవేక్షణ చేశారు. చిలకలూరిపేటలో జరుగుతున్న తీరును ఎమ్మెల్యే ప్రత్తిపాటి పరిశీలించారు. ఆర్వీఎస్ సీబీఎస్ హైస్కూల్లో బూత్‌లను పరిశీలించి, కార్యకర్తలకు సూచనలు చేశారు.

నాదెండ్ల : మండలంలోని నాదెండ్ల జడ్పీ హైస్కూల్ వద్ద రెండు పోలింగ్ స్టేషన్లో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 1,614 ఓట్లకు గానూ 1,448 పోలైనట్లు తహసీల్దారు రమణ తెలిపారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించారు




పోలీసు సహాయంతో ఓటేసేందుకు వస్తున్న దివ్యాంగుడు









పోలింగు కేంద్రం వద్ద అభివాదం చేస్తూ వస్తున్న ప్రత్తిపాటి

ఓటమి భయంతో రిగ్గింగు

- ఎన్నికల్లో బరి తెగించిన కూటమి నాయకులు, అనుచరులు
- దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం : ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - పల్నాడు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా టిడిపి నేతల తీరు దారుణంగా ఉందని ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బి.సలీం, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ఎంసిపిఐయు ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి రెడ్ బాషా గురువారం విలేకర్లతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన పట్టభద్రుల మండలి ఎన్నికలలో టిడిపి రాజకీయ నిరుద్యోగిని అభ్యర్థిగా నిలబెట్టి, దౌర్జన్యానికి పాల్పడిందన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, స్కీం వర్కర్లు, కార్మిక, కర్షకుల సమస్యలతో పాటు ఆయా ప్రాంతాల సమగ్రాభివృద్ధిపై అవలంభించాల్సిన విధానాలు, సాగు తాగునీటి సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా పోరాటాలు చేసిన వ్యక్తి కె.ఎస్.లక్ష్మణరావు గెలుస్తారనే భయంతో టిడిపి రిగ్గింగ్‌కు పాల్పడడం సిగ్గుచేటన్నారు. బరంపేట పోలింగ్ కేంద్రంలో స్వయంగా ఎమ్మెల్యే దగ్గర ఉండి కూలీలతో ఓట్లు వేయించారని, దీనిపై తహసీల్దార్ కు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపించారు. ప్రలోభాలు, దౌర్జన్యాలు చేసినా అనేకమంది వాటికి లొంగకుండా ఓట్లు వేయడం సంతోషకరమన్నారు. పట్టభద్రుల ఎన్నికల అక్రమాలపై పోలింగ్ కేంద్రంలో ఉన్న వెబ్ కెమెరాల ఆధారంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సజావుగా సాగిన పోలింగ్ సరళి ని పరిశీలించిన కూటమి నేతలు.. ఓటమి భయంతో మధ్యాహ్నం నుంచి దౌర్జన్యాలకు, రిగ్గింగ్ కు పాల్పడ్డారని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 15 నుంచి 20 శాతం వరకు కూటమి నేతలు దొంగ ఓట్లను వేయించారని, అయినా వారికి భంగపాటు తప్పదన్నారు. కూటమి నేతలు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి పిడిఎఫ్ ఏజెంట్ల పై దాడులకు పాల్పడటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు


ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిసినట్లు తహశీల్దార్ సిద్ధార్థ తెలిపారు. కొల్లిపర మండలంలో 20 గ్రామాలు కలిపి 2581 ఓట్లుకు గాను 1889 ఓట్లు పోలై 73.2శాతం వచ్చినట్లు ఆయన తెలిపారు. మూడు పోలింగ్ బూత్‌లు ఉండగా 313 పోలింగ్ బూత్‌లో 869 ఓట్లు ఉండగా పురుషులు 409 మహిళలు 198 (607), 314 బూత్‌లో 853 ఓట్లు ఉండగా పురుషులు 404 మహిళలు 244(648), 315 బూత్‌లో 861 ఓట్లు ఉండగా పురుషులు 401 మహిళలు 233(634) మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి విజయ రాజు తెలిపారు.


పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో 65 శాతం పైగా పోలింగ్

గురువారం జరిగిన ఉమ్మడి గుంటూరు, కష్ణా జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పెదనందిపాడు మండలంలో 1603 ఓట్లకు గాను 1070 ఓట్లు (66.7 శాతం) ఓట్లు పోల్ అవ్వడం జరిగింది. కాకుమాను మండలంలో 1076 ఓట్లకు గాను 736 ఓట్లు (68 శాతం) ఓట్లు పోల్ అవ్వడం జరిగింది. రెండు మండలాలలో అధికార కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లకు టికెట్ల డబ్బులు, 500 మందికి పైగా టెంట్లు వేసి భోజనాలు ఏర్పాట్లు చేశారు.పిడిఎఫ్ అభ్యర్థి కె యస్ లక్ష్మణ్‌రావు తరపున, రెండు మండలాల్లో ప్రజా సంఘాల నాయకులు కూటమి అభ్యర్థులకు ధీటుగా టెంట్లు వేసి స్లిప్పులు రాని ఓటర్లకు స్లిప్పులు పంచారు.


తుళ్లూరులో పోలింగ్ కేంద్రంలో ఓటర్లు

తుళ్లూరులో 80.99 శాతం పోలింగ్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని పరిధిలోని తుళ్లూరు జెడ్పి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 80.99 శాతం పోలింగ్ జరిగింది. 198,199,200 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటి పోలింగ్ బూత్‌లో 961, రెండో పోలింగ్ బూత్‌లో 888, మూడవ పోలింగ్ బూత్‌లో 813 ఓట్లు ఉండగా 2100 మంది ఓట్లు వేశారు. ఓటింగ్ ప్రశాంతంగా ముగిసిందని తహశీల్దార్ సుజాత చెప్పారు.

ఓటు వేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

మండలంలోని పెదపరిమి గ్రామానికి చెందిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 200వ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.


ఓటు హక్కు వినియోగించు కుంటున్న ఎమ్మెల్యే ప్రవీణ్

దొంగ ఓట్లు వేయించిన టిడిపి నాయకులు..

కొంతమంది టిడిపి నాయకులు దొంగనోట్లు వేయించారు. సిపిఎం నాయకులు అడ్డుకోవడంతో దొంగ ఓట్లును కొంతవరకు నిలువరించగలిగారు. మధ్యాహ్నం 3 గంటల తరువాత దొంగఓట్లు వేయించేందుకు టిడిపి నాయకులు సిద్ధపడగా సిపిఎం నాయకులు ఎం.రవి, ఎం. భాగ్యరాజు, జె.నవీన్ ప్రకాష్ అడ్డుకున్నారు.


పోలింగ్ తీరును పరిశీలిస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు

ప్రజాశక్తి దుగ్గిరాల

శివరాత్రి ఉత్సవాలు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పటికీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తగినంత పోలీసు బలగాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. గురువారం ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించేందుకు దుగ్గిరాలకు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 43 పోలింగ్ కేంద్రాలలో 149 పోలింగ్ బూతులలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు.


ఓటు వేసిన అనంతరం ప్రజా సంఘాల నాయకులు

పెదకాకానిలో

ప్రజాశక్తి - పెదకాకాని

పట్టభద్రుల ఎమ్ఎల్‌సి ఎన్నికలు పెదకాకాని మండలంలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఆరు గంటలకు పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుల సలహాలు సూచనలు తీసుకున్నారు. మండలంలో నాలుగు పోలింగ్‌కేంద్రాలు ఉండగా ప్రతి పోలింగ్ కేంద్రాలలో ఏజెంట్లు కీలక పాత్ర పోషించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.కళాధర్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో 2540 ఓట్లకు గాను 1825 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులు, ఉద్యోగ, ప్రజా సంఘాలు లక్ష్మణరావు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.


ఓటు హక్కు వినియోగించుకున్న ఉండవల్లి శ్రీదేవి

తాడికొండలో

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తాడికొండ ఎస్‌వివి హైస్కూల్లో గురువారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 68.8శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 2250 మంది ఓటర్లు ఉండగా 1734 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు తాడికొండలో 201 ,201 ఏ, 202 పోలింగ్ బూతులను అధికారులు ఏర్పాటు చేశారు. మాజీ శాసన సభ్యు రాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి తన ఓటు హక్కును వినియోగించు కున్నారు.

తాడేపల్లి రూరల్‌లో

కృష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి క్రిస్టియన్ పేట ఎలిమెంటరీ పాఠశాలలో జరిగింది. రూరల్ గ్రామాల పట్టభద్రుల ఓటింగ్ 77.6శాతం జరిగినట్లు బూత్ 285, 285-ఏ బూత్‌లలో ఎన్నికలు నిర్వహించిన అధికారులు తెలిపారు. తాడేపల్లి రూరల్ గ్రామాలకు సంబంధించి రెండుబూత్‌లను కేటాయించగా, 285 బూత్‌లో 600 ఓటర్లకుగాను 462 మంది ఓట్లు వినియోగించుకోగా, 285-ఏ బూత్‌లో 598 ఓటర్లు ఉండగా, 445 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 77.6శాతం ఓటింగ్ పోలైనట్లు తాడేపల్లి మండల తహశీల్దార్ డి.సీతారామయ్య తెలిపారు.

మంగళగిరిలో

మంగళగిరి పట్టణంలోని విటిజెయం డిగ్రీ కళాశాలలో పోలైన శాతం 66. 89. బూతుల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. 276 బూతులు 922 ఓట్లుగాను 592, 600 ఓట్లు గాను 383 ఓట్లు, 277ఏ బూతులో 550 ఓట్లు గాను 378, 280 బూతులో 744 ఓట్లు గాను 505ఓట్లు. 278 బూతులో837 ఓట్లు గాను 556 ఓట్లు, 279 బూతులో 884 ఓట్లు గాను 621 ఓట్లు పోలయినాయి.

సికె జూనియర్ కళాశాలలో జరిగిన బూతులు వారీగా ఓట్లు వివరాలు ఇలా ఉన్నాయి. మొత్తంగా పోలింగ్ శాతం 68.55, 272 బూతులో 750 ఓట్లు గాను 503 ఓట్లు, 273లో 918 ఓట్లు గాను 643 ఓట్లు, 274 బూతులో 824 ఓట్లు గాను 579, 275 లో600 ఓట్లు గాను 445, 275 ఏలో532 ఓట్లు గాను 374 ఓట్లు పోలైనట్టుగా సెక్టార్ ఆఫీసర్ మూర్తి తెలిపారు.


పత్తిపాడులో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న అధికారులు


కంట్రోల్ రూమ్ నుండి ఎన్నికల ప్రక్రియ పరిశీలిస్తున్న కలెక్టర్

పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన ఆర్‌ఓ

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి గురువారం పోలింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యవేక్షించారు. స్థానిక స్టాల్ గర్ల్స్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి పోలింగ్ అధికారులకు సూచనలు అందించారు. అనంతరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లోని కంట్రోల్ రూము నుండి జిల్లాలలోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్, లైవ్‌ఫీడ్‌ను పరిశీలిస్తూ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, డిఆర్‌ఓ ఎన్ ఎస్ కె.ఖాజావలి పోలింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించారు.


దీక్షల్లో కూర్చున్న నాయకులు

మాకు న్యాయం చేయండి

ప్రజాశ క్తి - తాడేపల్లి

ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని న్యాయమైన సమస్య మీద పోరాడుతున్న తమ కుటుంబాలకు న్యాయం చేయాలని ఎసిసిసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు విజ్ఞప్తి చేశారు. తమ బకాయిలు తమ కు ఇప్పించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 86వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎం శారద, డిరమణ, పి.బుజ్జి, వి.లక్ష్మి, యు.కాశమ్మ కూర్చున్నారు. దీక్షలు యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది కోట్ల రూపాయలు విలువ చేసే సిమెంట్ ఫ్యాక్టరీ భూములు తమకు రావలసిన వాటా మాత్రమే తమ అడుగుతున్నామని చెప్పారు. ప్రభుత్వం అందుకు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, ఎం గురవయ్య, వై.యహెూశోవ, డి.మాణిక్యరావ్, ఎస్.కె భాష, ఎస్.కె అగ్గయ్య, బి దానయ్య, ఆర్ ఇస్రాయెల్, దేవరాజు, ఎం సుబ్బారావు, ఎం శివకుమారి, యు.రమణ, సారమ్మ, రిబ్కా, ఎస్.కె హిమంబి, ఆర్ సామ్రాజ్యం పాల్గొన్నారు.

దంపతుల మృతిపై విచారణ : ఎస్పీ

ప్రజాశక్తి దుగ్గిరాల

రేవేంద్రపాడు గ్రామంలో బుధవారం రాత్రి భార్యా భర్తలు మృతి చెందిన సంఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ తెలిపారు. ఎన్నికల తీరును పరిశీలించేందుకు గురువారం దుగ్గిరాల వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వివాహేతర సంబంధం కారణంగా ఈ సంఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం అందిందన్నారు. గదిలోపల నుండి గడియ పెట్టి ఉన్నందున బయట వారు హత్య చేసే అవకాశం లేదనీ, భార్యను హత్య చేసిన అనంతరం భర్త ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని చెప్పారు. పోస్టుమార్టం రిపోర్టు అందిన అనంతరం పూర్తి విషయాలు వెలుగు చూస్తా యని చెప్పారు. శరీరంపై గాయాలు ఉన్నాయా లేక పీకనులిమి హత్య చేశారా అనే విషయాలు రిపోర్టులో తెలుస్తాయన్నారు. ఇది ఇలా ఉండగా ఇద్దరి మృతదేహాలు బుధవారం రాత్రి ఎయిమ్స్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మల్లేశ్వర స్వామి రథోత్సవంలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి మంగళగిరి

శివరాత్రి వేడుకల్లో భాగంగా మంగళగిరిలోని బ్రహ్మాసూత్రంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వ హించిన రథోత్సవంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన రథోత్సవంలో మంత్రి ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల శివనామ స్మరణ, అశేష జనసందోహం మధ్య రథాన్ని లాగారు. వేడుకల్లో స్థానిక నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సజావుగా సాగిన ఓటింగ్ సరళి

ప్రజాశక్తి ప్రత్తిపాడు:

పట్టభద్రుల ఎన్నికలు గురువారం ప్రత్తిపాడు మండల కేంద్రంలోని బి.వీ.ఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగాయి. మండలంలో మొత్తం 1320 ఓటర్లు ఉండగా వారికి రెండు బూత్ కేటేయించగా 256 బూత్‌లో 703 ఓటర్లను కేటాయించగా 257 బూత్‌లో 617 ఓటర్లను కేటాయించారు. ఉదయం కాస్త మందగించినా మధ్యాహ్నం నుంచి ఓటర్లు అధిక సంఖ్యలో హాజరై ఓటు వేశారు. ఓటింగ్ ముగిసే సమయానికి ఐదుగురు ఓటు వేసేందుకు వచ్చి ఓటు నమోదుకు తగిన గుర్తింపు కార్డు లేకపోవడం తో వెను తిరిగారు. ఓటింగ్ ముగిసే సమయానికి 256 పోలింగ్ బూత్ 703 ఓట్లకు గాను 503 నమోదయ్యాయి. 257 బూత్‌లో 617 ఓట్లకు గాను 441 ఓట్లు పోలయినట్లు అధికారులు తెలిపారు. ముడు గంటల ప్రాంతంలో స్థానిక ఎమ్మెల్యే బి రామాంజనేయులు ప్రత్తిపాడులోని తెలుగుదేశం పార్టీ వారు ఏర్పాటు చేసిన టెంట్ వద్దకు వచ్చి ఓటింగ్ సరళి అడిగి తెలుసుకున్నారు.


చంటిబిడ్డతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళ



అక్రమాలకు తెగబడుతున్న అధికార పార్టీ

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - మంగళగిరి

కృష్ణా, గుంటూరు జిల్లాల శాసనమండలి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలకు తెగబడుతోందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు తీవ్రంగా విమర్శించారు. గురువారం మంగళగిరిలో సికె హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలోని దుర్గి, బెల్లంకొండతో పాటు మరికొన్ని మండలాల్లోని కొన్ని బూత్‌లలో మా తరపు ఏజెంట్లను బయటకు పంపారు. ఇదేమి న్యాయం? మీకు చేతనైతే తలపడండి.. అంతేగాని, ఏజెంట్లను అలా బయటకు పంపడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెనాలిలో మున్సిపల్ హైస్కూల్‌లోని ఏడు బూత్‌లలో కోగంటి శివయ్య అనే వ్యక్తి పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. మంగళగిరిలో కూడా ఆ విధంగానే జరుగుతోంది. అధికార పార్టీ వాళ్లు గేటు దాకా వచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. మేము ప్రచారం చేసుకోకూడదు. ఇదెక్కడి న్యాయం? ఇవి సహజన్యాయ సూత్రాలా? వీటన్నింటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నాం అని తెలిపారు. ప్రజలు, గ్రాడ్యుయేట్స్ మద్దతు పొందలేకపోవడంతో జావగారిపోయి ఇలాంటి పద్ధతులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వీటిని మేం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికార పార్టీ పాల్పడుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పద్ధతులపై ఎన్నికల సంఘం అధికారి వివేక్ యాదవ్‌కి, ఆర్వో, జిల్లా కలెక్టర్, ఎస్‌పి లకు కూడా ఫిర్యాదు చేశామని, ఎన్నికలు క్రమపద్ధతిలో నిర్వహించాలని మేం డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు.



పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్

ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

ప్రజాశక్తి తాడేపల్లి

ఉండవల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంగళగిరి ఎమ్మెల్యే ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్య మంత్రి, మంత్రి ఉండవల్లిలోని తన నివాసం నుండి ఓటు హక్కు వినియోగించుకోవడానికి రావడంతో 30నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఉండవల్లి గృహాల వైపు, గుం టూరు ఛానల్ కాలువ దగ్గర ఇరువైపులా పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో సామాన్య ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోకుండా నిలుపుదల చేశారు.

మాచర్ల నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఖూనీ

దౌర్జన్యం.. దొంగ ఓట్లు.. రిగ్గింగ్.. - రీ పోలింగ్ నిర్వహించాలి : సిఐటియు

ప్రజాశక్తి- మాచర్ల

కృష్ణా గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్ మాచర్ల నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లుగా ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాచర్ల పట్టణంలోని సెయిన్‌టాన్స్ బాలికల హైస్కూల్ లో జరిగిన ఎన్నికల సరళి అధికార పార్టీ అధికార బలంతో, డబ్బు జులంతో, దౌర్జన్యంగా దొంగ ఓట్లు వేసుకున్నారని ఆయన మండి పడ్డారు. కొంత మంది ఓటర్ల దగ్గర ఓటరు స్లిప్పులు కూడా బలవంతంగా లాక్కొని తెలుగుదేశం కార్యకర్తలు ఓట్లు వేశారని, చివరి గంట సమయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లను దౌర్జన్యంగా బయటకు పంపించి మూకుమ్మడిగా ఓట్లు వేసుకున్నారని ఆయన ఆరోపించారు. వెల్దుర్తి మండలంలో అసలు పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంటుని లోపలికి రానివ్వకుండ భయపెట్టి మొత్తం ఓట్లను రెగ్గింగ్ చేసుకొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాచర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రీపోలింగ్ జరపాలని ఆంజనేయులునాయక్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల మహేష్, నాయకులు వేముల వెంకట్రావు తదితరులున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



తెనాలి మున్సిపల్ బాలుర హైస్కూలులో ఓటు హక్కు వినయోగించుకుంటున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి నాదెండ్ల



గుంటూరులో ఓటు హక్కు వినయోగించుకున్న జిల్లా కలెక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలోని 225 పోలింగ్ బూత్‌లో పిడిఎఫ్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు దంపతులు వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇదే కేంద్రంలోని 226 పోలింగ్ బూత్‌లో టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్టాల్ గరల్స్ హైస్కూల్లోని 213 పోలింగ్ బూత్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇదే కేంద్రంలోని 221ఎ పోలింగ్ బూత్‌లో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, 213ఎ బూత్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు దంపతులు ఓటు వేశారు. తెనాలి మున్సిపల్ బాలుర హైస్కూలులో ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నాదెండ్ల మనోహర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



గుంటూరులో ఓటు హక్కు వినియోగిం చుకున్న కెఎస్ లక్ష్మణరావు దంపతుల



గుంటూరులో ఓటు హక్కు వినియోగించుకున్న జెసి



గుంటూరులో ఓటు హక్కు వినియోగించుకున్న కమిషనర్ దంపతులు

ఓటమి భయంతో కూటమి దాడులు.. బెదిరింపులు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలకు తెరతీసిన అధికార పార్టీ
- నిర్లిప్తంగా వ్యవహరించిన యంత్రాంగం
- పలుచోట్ల పిడిఎఫ్ కార్యకర్తలపై దౌర్జన్యాలు
- అధికార పార్టీ చర్యలతో ఉద్రికత్త వాతావరణం









ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం గుంటూరు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద అధికార పార్టీ పెద్ద ఎత్తున అక్రమాలకు తెర తీసింది. పెద్దల సభకు జరిగే ఈ ఎన్నికల్లో అప్రజాస్వామికంగా వ్యవహరించటంపై సాధారణ ఓటర్ల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. పదే, పదే పోలింగ్ కేంద్రం గేట్లవద్ద, ప్రాంగణంలోనికి గుంపులు గుంపులుగా వెళ్లి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారు. పోలింగ్ కేంద్రం ప్రాంగణంలోకి, నిర్దేశిత వందల మీటర్లలోపు క్యాంపెయిన్ చేయకూడదనే నిబంధన ఉన్నా దానిని పాటించకుండా అధికార పార్టీ కార్యకర్తలు వ్యవహరించారు. వంద మీటర్లలోపు ఏర్పాటు చేసిన టెంట్లు తొలగించినా వారి క్యాంపెయిన్ పట్ల మాత్రం చూసీచూడనట్లు వ్యహరించారు. వారి చర్యలను యంత్రాంగం అడ్డుకోకుండా ఉదారంగా వ్యవహరించటం ద్వారా వారికి సహకరించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిడిఎఫ్ అభ్యర్థి తరపు ఏజెంట్లను పలుచోట్ల బెదిరింపులకు గురిచేశారు. చలమయ్య కాలేజి వద్ద ఏకంగా పోలింగ్ కేంద్రంలోనే ఏజెంట్‌కు డబ్బులు ఆశ చూపించారు. పోలింగ్ అధికారులు, పోలీసులు ఈవ్యవహారాన్ని చూస్తున్నా నిరోధించలేదు. అనేక మంది పిడిఎఫ్ ఏజెంట్లు అధికారపార్టీ ప్రయత్నాలను అడ్డుకొని నిలబడ్డారు. అనేక చోట్ల పోలింగ్ అధికారులు ఉదారంగా వ్యవహరించారు. ముఖ్యంగా గుజ్జనగుండ్ల పాలిటెక్నిక్ కాలేజిలో, ఎస్‌కెబిఎం హైస్కూల్, చలమయ్య కాలేజి పోలింగ్ కేంద్రంలో గుర్తింపు కార్డులు చూడకుండానే ఓటర్లను ఓటుకు అనుమతించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 243/ఎ బూత్‌లో పలువుర్ని దొంగ ఓట్లు అని పిడిఎఫ్ ఏజెంట్ అభ్యంతరం తెలిపినా అధికారులు పట్టించుకోకుండా ఓటుకు అనుమతించటం గమనార్హం. ఏటి అగ్రహారం ఎస్‌కెబిఎం హైస్కూల్లోని 215 పోలింగ్ బూత్‌లో పిడిఎఫ్ ఏజెంట్ ఎస్.సహశ్రీ ఓటునే దొంగ ఓటు వేయటానికి ప్రయత్నం చేయగా, సదరు ఏజెంట్ వెంటనే అడ్డు చెప్పటంతో సదరు వ్యక్తి బయటకు వెళ్లిపోయాడు. స్థానిక మంగళదాస్ నగర్‌లోని 251 పోలింగ్ కేంద్రంలో, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కేంద్రం వద్ద దొంగ ఓట్లు వేసే వారిని పిడిఎఫ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. అనేకచోట్ల దొంగ ఓట్లు వేయటానికి పెద్ద ఎత్తున ప్రయత్నం జరిగింది. చలమయ్య కాలేజి కేంద్రం వద్ద కూటమి నాయకులు పిడిఎఫ్ అభ్యర్థి మద్దతు దారుడిని దుర్భాషలాడటమే కాకుండా, దానిని ప్రశ్నించినందుకు భౌతిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఈ కేంద్రం వద్ద ఉదయం నుండి సాయంత్రం వరకూ ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. ఇక్కడ వంద మీటర్ల లోపలే అధికార పార్టీ వారు టేటుల్ వేసుకొని క్యాంపెయిన్ చేసినా పోలీసులు పట్టించుకోలేదు. హిందూ కాలేజిలోని ఓ పోలింగ్ బూత్‌లోకి ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ప్రవేశించే ప్రయత్నం చేయటంతో పిడిఎఫ్ ఏజెంట్ నుండి అభ్యంతరం వ్యక్తం అయ్యింది. మీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగారని తెలుస్తుంది. చివరికి పిఒకు ఫిర్యాదు చేయటంతో అక్కడి నుండి బయటకు వెళ్లారు. ఆతర్వాత కూడా కార్పొరేటర్లు కొందరు పోలింగ్ బూత్‌లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో నూ పట్టభద్ర ఓటర్లు, సీనియర్‌సిటిజన్లు, పసిబిడ్డల తల్లుల తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.





గుంటూరులో పలు కేంద్రాల్లో ఓటు వేయడానికి బారులుదీరిన ఓటర్లు